క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

నెల్లిమర్ల: ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని నగరపంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, కమిషనర్ టి.జయరాం సూచించారు. స్థానిక పట్టణంలోని 13వ వార్డులో మురుగు కాలువల్లో మంగళవారం చేపట్టిన పూడికతీతలను వారు పరిశీలించి, పలు సూచనలు చేశారు. కాలువల్లో చెత్తాచెదారం వేయవద్దని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. దోమలు వృద్ధి చెందకుండా మన పరిసరాలు పొడిగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం అదే వార్డులో నెలకొన్న సమస్యలను కౌన్సిలర్ మజ్జి అన్నపూర్ణను అడిగి తెలుసుకున్నారు.

లేఅవుట్ల క్రమబద్ధీకరణపై అవగాహన కల్పించండి


మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణపై ప్రజలకు అవగాహన కల్పించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్, ప్రణాళికా కార్యదర్శులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. లే అవుట్ల క్రమబద్ధీకరణకు మరో రెండు నెలలు మాత్రమే గడువు ఉన్నందున దీనిపై విస్తృత స్థాయిలో ప్రచారం చేపట్టాలని తెలిపారు. పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి, టీపీవో అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

విజయనగరంఫోర్ట్: మహిళలకు తమ భద్రతకు సంబంధించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండడం చాలా అవసరమని వన్‌స్టాప్ సెంటర్ కౌన్సిలర్ కె.రమాదేవి తెలిపారు. స్థానిక మెప్మా కార్యాలయంలో మహిళలు, బాలల సంరక్షణకు ఉన్న చట్టాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఆపదలో ఉన్న మహిళలు, బాలికలు, యువతులు ఎవరైనా రక్షణ, వైద్య, న్యాయ సహాయం కోసం వన్‌స్టాప్ సెంటర్‌ను ఆశ్రయించవచ్చన్నారు. ఎవరికి ఏ సమస్య ఉన్నా టోల్‌ఫ్రీ నంబర్181కు ఫోన్ చేయాలన్నారు. బాల్యవివాహాల నిర్మూలనకు, తప్పిపోయిన బాలల గుర్చి సమాచారం ఇవ్వడానికి టోల్‌ఫ్రీ నంబర్1098ను సంప్రదించాలన్నారు.

ఈ-పాస్ మెషిన్ల పంపిణీ


ఈ-పాస్ మెషిన్లు అందజేస్తున్న సీఎస్‌డీటీ మురళి

భోగాపురం: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లోని 79 మంది రేషన్‌షాపుల డీలర్లకు మంగళవారం ఈ-పాస్ మెషిన్లు పంపిణీ చేశారు. ఇటీవల ప్రభుత్వం పంపిణీ చేసిన కొత్త స్మార్ట్ రైస్ కార్డులపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను ఈ మెషిన్‌లో స్కాన్ చేస్తే సులభంగా రేషన్ పంపిణీ చేయవచ్చని సీఎస్‌డీటీ మురళి తెలిపారు.

యూరియాకు బదులుగా నానో యూరియా వాడాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న శ్రీలక్ష్మి

నెల్లిమర్ల రూరల్: యూరియాకు బదులుగా నానో యూరియా వాడాలని ఏవో శ్రీలక్ష్మి రైతులకు సూచించారు. మండలంలోని కొండవెలగాడ గ్రామంలో మంగళవారం నిర్వహించి పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని, నానో యూరియా ప్రయోజనాలను రైతులకు తెలిపారు. గుళికల రూపంలోని యూరియాను పంటలో వేసుకుంటే 50 శాతం మాత్రమే పంటకు అందుతుందని, అదే ద్రవరూపంలోని నానో యూరియా వేసుకుంటే వంద శాతం పంటకు అందుతుందన్నారు. నానో యూరియా వేసుకుంటే పంటకు అయ్యే ఖర్చు తగ్గుతుందన్నారు. నేల కూడా సారవంతమవుతుందన్నారు. ఆధార్‌పై 5 బస్తాల కన్నా ఎక్కువ ఇస్తే లైసెన్సులు రద్దు చేస్తామన్నారు.

గర్జించిన అన్నదాత

రైతు సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యంపై అన్నదాత గర్జించాడు. రెండు నెలలుగా ఎరువుల కోసం అవస్థలు పడుతుంటే మా బాధలు పట్టవా అని ఆగ్రహించాడు. ఎండనకా..వాననకా తిరుగుతుంటే పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశాడు. ఓటేసిన పాపానికి రోడ్డుపాలు చేశారని వాపోయాడు. తమ ఉసురు తప్పకుండా తలుగుతుందని ప్రభుత్వానికి శాపనార్థాలు పెట్టాడు. యూరియా అందివ్వాలని లేకుంటే భవిష్యత్‌లో రైతన్న కోపానికి గురై భూస్థాపితం కావడం ఖాయమని హెచ్చరించాడు. ఇదీ..విజయనగరం జిల్లా కేంద్రంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాత పోరులో వినిపించిన రైతు గొంతు.

- రైతు సమస్యలపై వైఎస్సార్ సీపీ పోరుబాట
- కర్షకుడికి బాసటగా జిల్లా కేంద్రంలో 'అన్నదాత పోరు'
- పెద్దఎత్తున తరలివెళ్లిన పార్టీ శ్రేణులు, రైతులు
- అడుగడుగునా ఆంక్షలు ఎదురైనా లెక్క చేయని నేతలు
- కడుపు నింపే రైతన్నకు అన్యాయం చేయొద్దని హితవు
- యూరియా అందేలా చూడాలని ఆర్డీవోకు వినతి



అన్నదాత పోరు ర్యాలీలో పాల్గొన్న మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, తదితరులు

విజయనగరం: ఎరువుల బ్లాక్ మార్కెట్, యూరియా కొరతపై రైతులకు అండగా జిల్లా కేంద్రంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమం విజయవంతమైంది. రైతులకు మద్దతుగా అన్ని ప్రాంతాల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి, గొంతెత్తి నినదించారు. అడుగడుగునా పోలీసులు ఆంక్షలు విధించి ఆపాలని చూసినా అన్నదాతకై ఆంక్షల సంకెళ్లు తెంచుకుని పరుగులు తీశారు. రైతన్నకు బాసటగా నిలిచారు. కలెక్టరేట్ జంక్షన్ మీదుగా విజయనగరం ఆర్డీవో కార్యాలయం వరకు కొనసాగిన ఈ ర్యాలీలో మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, మాజీ ఎమ్మెల్యేలు బడ్డుకొండ అప్పలనాయుడు, కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు, రైతులు పాల్గొని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతులకు యూరియా సరఫరా చేయాలని, ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలడాన్ని అరికట్టాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, నష్టపోయిన పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ అందజేయాలని, ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలీసులు అడ్డుకున్నా సీఎం డౌన్..డౌన్..రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం అని నినదిస్తూ వెళ్లి, ఆర్డీవో దాట్ల కీర్తికి వినతిపత్రం అందజేశారు.

పోలీసుల బెదిరింపులు..

రైతన్నకు మద్దతుగా వైఎస్సార్ సీపీ తలపెట్టిన ఈ అన్నదాత పోరు కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు వివిధ సెక్షన్ల పేరిట వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు, రైతులను బెదిరింపు చర్యలకు దిగడాన్ని పలువురు తప్పుబట్టారు. కలెక్టరేట్ వద్ద పూలే విగ్రహం వద్ద వేసిన టెంట్లు అన్యాయంగా తొలగించారు. శాంతియుతంగా నిరసన చేపడతామన్నా చేయనీయలేదు. సెక్షన్ 30 అమలులో ఉందని, 15 మంది కన్నా ఎక్కువ మంది గుమికూడి ఒక్కచోట ఉండొద్దని హెచ్చరించారు. ఓ డీఎస్పీ, ముగ్గురు సీఐలు, ఐదుగురు ఎస్‌ఐలు సహా 45 మంది పోలీస్ సిబ్బంది ఉన్నా అధికార యంత్రాంగం ద్వారా ప్రభుత్వానికి తమగోడు చెప్పుకునే దానిలో రైతులు విజయవంతమయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు వర్రి నర్సింహమూర్తి, సంగంరెడ్డి బంగారునాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టివీరవెంకటరాజేష్, జెడ్పీటీసీలు గొర్లె సరయు, సీతామహాలక్ష్మి, ఎంపీపీలు గేదెల శ్రీను, గోపమ్మ, మామిడి అప్పలనాయుడు పాల్గొన్నారు.


ఆర్డీవో కీర్తికి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అప్పుల ఊబిలో రైతులు..

కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయే పరిస్థితి దాపురించింది. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయం బాగా చేసుకుని గౌరవంగా జీవించే రైతులు ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఎరువులందక కాళ్లరిగేలా వారు తిరుగుతుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా కూడా లేదు. గంటల తరబడి ఎండల్లో క్యూలైన్లలో రైతులు నిల్చొన్న పరిస్థితులు, తోపులాటలో గాయాలపాలైన అన్నదాతలు కనిపించడం లేదా? కష్టాల్లో ఉన్న రైతన్నను ఆదుకోవాల్సింది పోయి ఇలా హింసించడం తగదు.

– కడుబండి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే, ఎస్‌కోట నియోజకవర్గం

అన్నదాత ఉసురుపోసుకోవద్దు..

పది మందికి పట్టెడన్నం పెట్టే అన్నదాత ఉసురుపోసుకోవద్దు. సీఎం చంద్రబాబు, వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెన్నాయుడులు వ్యవసాయాన్ని, రైతులను చులకనగా చూడడం మానుకోవాలి. రాష్ట్రంలోని అధిక శాతం మంది వ్యవసాయ రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. అలాంటి వారిపై ఎందుకీ కక్ష. వారికి సాగు సాయం ఎలాగో ఇవ్వలేరు.. కనీసం వారికి సరిపడా యూరియా కూడా అందించలేరా..చంద్రబాబు అధికారంలోకి వస్తే అయితే అతివృష్టి..లేకుంటే అనావృష్టి అనేది నానుడిగా స్థిరపడిపోయింది. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాలు స్థాపించి, ఉన్న ఊరిలోనే రైతుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు వారి వద్దకే అందించారు. అలా చేయడం చేతకదా ఈ ప్రభుత్వానికి. రైతులు ఎదుర్కొంటున్న ఎరువుల కొరత తెలీదా. ఇప్పటికైనా వారి గోడు పట్టించుకోండి.. వారికి న్యాయం చేయండి.

– కోలగట్ల వీరభద్రస్వామి, మాజీ డిప్యూటీ స్పీకర్, విజయనగరం

దున్నపోతుపై వర్షం కురిసిన చందంగా..

ఖరీఫ్ వరి సాగులో అన్నదాత పడుతున్న అవస్థలు చూసి కూడా ప్రభుత్వం స్పందించడం లేదు. దున్నపోతుపై వర్షం కురిసినా చలించని చందంగా సీఎం చంద్రబాబు తీరు ఉంది. గతంలో ఎన్నడూ లేని ఎరువుల కొరత ఈసారి చూస్తున్నాం. ఇది నూటికి నూరు పాళ్ల ప్రభుత్వ వైఫల్యమే. బ్లాక్‌లో ఒక్కో యూరియా బస్తా రూ.600 అమ్ముతున్నారు. ఇప్పటివరకు ప్రభుత్వంలో ఎవరూ మాట్లాడడం లేదు. కనీసం వ్యవసాయ శాఖ మంత్రి కూడా స్పందించకపోవడం దుర్మార్గం. పైగా ఎండలో ఎరువుల కోసం నిలబడే రైతులను చూసి ఆయన హేళన చేయడం బాధాకరం.

– బడ్డుకొండ అప్పలనాయుడు, మాజీ ఎమ్మెల్యే, నెల్లిమర్ల నియోజకవర్గం

వ్యక్తిగత గొడవలను పార్టీకి ముడిపెట్టడం సరికాదు

- కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టి వీరవెంకటరాజేష్


మాట్లాడుతున్న కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టి వీరవెంకటరాజేష్

విజయనగరం: నగరంలోని నాగవంశం వీధిలో ఇద్దరి మధ్య జరిగిన వ్యక్తిగత గొడవలను రాజకీయ పార్టీలకు ముడిపెట్టడం సరికాదని కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టి వీరవెంకటరాజేష్ అన్నారు. ఇదే విషయమై ఆయన నగరంలో మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి నివాసంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఈ నెల 6వ తేదీ సాయంత్రం జరిగిన వినాయక నిమజ్జనం ఊరేగింపులో ఇద్దరు వ్యక్తుల మధ్య నెలకొన్న పాతకక్షల కారణంగా వారి మధ్య గొడవ జరిగితే అందులో వైఎస్సార్ సీపీ నాయకుల ప్రమేయం ఉందని విషప్రచారం చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి చర్యలను వైఎస్సార్ సీపీ ఎప్పుడూ ప్రోత్సహించదన్నారు. అధికార పార్టీకి చెందిన కొంతమంది తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఆ గొడవను వైఎస్సార్ సీపీకి అంటగట్టారని ఇలా ప్రచారం చేయడం ఎంత మాత్రం సరికాదన్నారు. టీడీపీ నాయకులు ఇలాంటి చౌకబారు రాజకీయాలు మానుకోవాలని హితవుపలికారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నగర పార్టీ అధ్యక్షుడు ఆశపు వేణు, జిల్లా ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నీటిపన్ను వసూళ్లను వేగవంతం చేయండి

విజయనగరం: నగరంలో చేస్తున్న నీటిపన్ను వసూళ్లను వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో నీటిపన్ను వసూళ్లపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల వారీగా చేపట్టిన ఈ సమీక్షలో లక్ష్యాల కన్న దిగువ స్థాయిలో జరిగిన వసూళ్లపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. శతశాతం వసూలు జరిగేలా చూడాలన్నారు. దీర్ఘకాలంగా నీటిపన్ను చెల్లించని వారి కుళాయి కనెక్షన్లను తొలగించాలని ఆదేశించారు. అలాగే తాగునీటి వృథాకు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, డీఈ నరసింహారెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


నీటిపన్ను వసూళ్లపై సమీక్షిస్తున్న కమిషనర్ నల్లనయ్య

స్మార్ట్‌మీటర్లు రద్దయ్యే వరకు పోరాటం ఆగదు


రామకృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

విజయనగరం గంటస్తంభం: విద్యుత్ పోరాటం -2000లో అసువులు బాసిన సీపీఎం నాయకుడు సత్తెనపల్లి రామకృష్ణ స్ఫూర్తితో విద్యుత్ స్మార్ట్‌మీటర్ల రద్దుకు పోరాడుతున్నామని, అది రద్దయ్యేంత వరకు తమ పోరాటం ఆగదని సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు అన్నారు. నగరంలో సత్తెనపల్లి రామకృష్ణ వర్ధంతి మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆ పార్టీ నాయకులంతా రామకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజాపోరాటంలో ఆయన సేవలను కొనియాడారు. ప్రస్తుతం అధికారంలోని కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచబోమని చెబుతూనే పెంచిందని, అంతేకాకుండా వినియోగదారులకు నష్టం కలిగించే స్మార్ట్‌మీటర్లను తీసుకువస్తోందని విమర్శించారు. పెంచిన కరెంట్ చార్జీలు, స్మార్ట్‌మీటర్లు రద్దు చేసే వరకు ప్రజల తరఫున తమ పోరాటం కొనసాగుతుందన్నారు.

తక్షణమే డీఏ బకాయిలు చెల్లించాలి

విజయనగరం అర్బన్: సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయి డీఏలు తక్షణమే చెల్లించాలని ఏపీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బల్లా శ్రీనివాసరావు ఓ ప్రకటనలో మంగళవారం డిమాండ్ చేశారు. ఇంతవరకు జ్యుడీషియల్, అసెంబ్లీ ఉద్యోగులు సహా ఏపీ సచివాలయ సీపీఎస్ ఉద్యోగులకు ఐదేళ్లుగా సీఎఫ్‌ఎంఎస్ గ్రీన్‌చానల్‌లో ఉన్న 60 నెలల డీఏ బకాయిలను చెల్లించిందన్నారు. మిగిలిన అన్ని శాఖల సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు కూడా డీఏ బకాయిలు చెల్లించాలని కోరారు.

వితరణ

డెంకాడ: సత్యసాయిబాబా జయంత్యుత్సవాలు పురస్కరించుకుని, మండలంలోని పినతాడివాడ గ్రామ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు మంగళవారం వితరణ చేశారు. అలాగే మండల కేంద్రంలో పలువురికి అన్నదానం కూడా చేశారు. కార్యక్రమంలో సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

పూసపాటిరేగ: మండలంలోని కొల్లాయివలస గ్రామానికి చెందిన చేట్ల నందినికి మంజూరైన రూ.1.36 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే లోకం నాగమాధవి చేతులమీదుగా మంగళవారం అందజేశారు. నిరుపేదరాలైన ఆమె..వైద్య ఖర్చుల నిమిత్తం సాయం కోసం సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా ఆర్థిక సాయం అందజేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

కమిషనర్ పర్యటన

విజయనగరం: నగరంలోని పలు ప్రాంతాల్లో నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య మంగళవారం పర్యటించారు. పారిశుద్ధ్యం మెరుగుకు కృషి చేయాలని సిబ్బందికి తెలిపారు. అలాగే అభివృద్ధి పనుల్లో నాణ్యత ఉండేలా చూడాలని, సచివాలయ సిబ్బంది సక్రమంగా ప్రజలకు సేవలందించాలని సూచించారు.

సన్మానం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పారసాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిద్ధాంతం త్రినాథరావు ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోగా ఆయనను పాఠశాలలో మంగళవారం సన్మానించారు. అనంతరం ఆయన విధి నిర్వహణలో చూపిస్తున్న అంకితభావం, చిత్తశుద్ధి, నిబద్ధతను వక్తలు ప్రశంసించారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరానికి విశేష స్పందన

విజయనగరం అర్బన్: మండలంలోని సీతం ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం చేపట్టిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, మాక్సివిజన్ ఐ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వివిధ కంటి సమస్యలతో బాధపడుతున్న వారంతా వచ్చి కంటి పరీక్షలు చేయించుకున్నారు. వారిలో అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. మొత్తం 998 మంది కంటి పరీక్షలు చేసుకున్నారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు తెలిపారు. కార్యక్రమంలో క్యాంప్ కో–ఆర్డినేటర్ బి.సంతోష్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామ్మూర్తి, ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా నోడల్ అధికారి ఎన్.సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


నేత్ర వైద్య తనిఖీలు చేస్తున్న సిబ్బంది

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

విజయనగరం అర్బన్: స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో కేంద్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన అధికారి ఎన్.ప్రేమభరత్‌కుమార్ మాట్లాడుతూ యువతకు జీవనోపాధి, అభివృద్ధికి కేంద్రం అమలు చేస్తున్న పథకాలను వివరించి, వాటిని వినియోగించుకోవాలని కోరారు. అనంతరం పథకాలపై అవగాహన కల్పిస్తూ రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పోరాటయోధుడు సురవరం సుధాకర్‌రెడ్డి


సుధాకర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

విజయనగరం గంటస్తంభం: ప్రజా పోరాటయోధుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని, ఆయన అణగారిన వర్గాల సంక్షేమం, అభివృద్ధి, భద్రతకు చేసిన కృషి మర్చిపోలేనిదని వక్తలు కొనియాడారు. స్థానిక డీఎస్‌ఆర్ అమర్‌భవన్‌లో సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన సీపీఐ నాయకులు ఒమ్మి రమణ, పి.కామేశ్వరరావు, తమ్మినేని సూర్యనారాయణలు సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి సుధాకర్‌రెడ్డి అలుపెరుగని పోరాటం చేశారని, ముఖ్యంగా తెలంగాణలోని నల్గొండ జిల్లాకు కృష్ణానది జలాల తరలింపు ద్వారా ఏర్పడిన ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి ఆయన చేసిన కృషి ప్రశంసనీయమన్నారు.


దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరంఫోర్ట్: రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ బ్లడ్‌బ్యాంక్‌లో టెక్నికల్ సూపర్‌వైజర్లుగా పనిచేయడానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి పి.సత్యం ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. బీఎస్సీ ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ విద్యార్హత కలిగి, రెండేళ్ల పని అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. ఎంపికైన వారికి రూ.20 వేల నుంచి రూ.22 వేల వేతనం అందివ్వడం జరుగుతున్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 08922–272700, 9493092700లను సంప్రదించాలని ఆయన కోరారు.

పారామెడికల్ కోర్సులకు..


విజయనగరంఫోర్ట్: పారామెడికల్ కోర్సు(డీఎంఎల్‌టీ, డీఎంఎస్‌టీ, డీవోఏ, డీఏఎన్‌ఎస్)ల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దేవీమాధవి ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఈ నెల 12వ తేదీన ఉదయం 10:30 గంటలకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని, అభ్యర్థులంతా తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఏడాది ఫీజు రూ.7,700లను ఒకేసారి చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

ప్రభుత్వం మొద్దునిద్ర వీడాలి..



నెల్లిమర్ల: విజయనగరం జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన అన్నదాత పోరు కార్యక్రమానికి నెల్లిమర్ల మండల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బయలుదేరి వెళ్లి, రైతులకు తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. పార్టీ నగరపంచాయతీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు మాట్లాడుతూ రైతులకు అందాల్సిన ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. రైతులకు యూరియా కొరత తీర్చడంలో ప్రభుత్వం వహిస్తున్న మొద్దునిద్ర వీడాలన్నారు. ఇప్పటికైనా అన్నదాతలకు సరిపడ యూరియా అందివ్వాలని కోరారు. కార్యక్రమంలో నగరపంచాయతీ వైస్ చైర్మన్లు ఎస్.రామారావు, కె.కృష్ణ, కౌన్సిలర్ సంతోష్‌కుమార్, నాయకులు హరీష్, రవి, మోహనరావు, అప్పలనాయుడు, ఇడదీసి శ్రీనివాసరావు, నల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం నుంచి అన్నదాత పోరుకు..



భోగాపురం: యూరియా కోసం రైతులు పడుతున్న అవస్థలను ప్రభుత్వానికి తెలియజేయడమే ప్రధాన అజెండాగా విజయనగరం జిల్లా కేంద్రంలో వైఎస్సార్ సీపీ మంగళవారం తలపెట్టిన అన్నదాత పోరు కార్యక్రమానికి మండల వైఎస్సార్ సీపీ నాయకులు పెద్దసంఖ్యలో బయలుదేరి వెళ్లారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని పార్టీ నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, రైతులంతా అక్కివరం జంక్షన్‌కు చేరుకుని, అక్కడి నుంచి ర్యాలీగా విజయనగరానికి వెళ్లారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి సుందరహరీష్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బైరెడ్డి ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండు విడతల్లో యూరియా వేసుకోవాలి



డెంకాడ: వరి పంటకు రెండు విడతల్లో యూరియా వేయాలని జిల్లా ఉద్యానవన అధికారి చంద్రశేఖరరావు సూచించారు. మండలంలోని సింగవరం గ్రామంలో 'యూరియా..మీ చెంతకు' అనే కార్యక్రమం జరగ్గా, ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. వరి పండిస్తున్న వారంతా రెండు విడతలుగా వేసుకునే యూరియాను ఒక్కో విడతలో 25 కిలోలు చొప్పున వేసుకోవాలని తెలిపారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వేసుకున్నా మంచి ఫలితాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు రాజారావు, మండల వ్యవసాయాధికారి సంగీత, ఏఈవో రామకోటి, గ్రామ వ్యవసాయ సహాయకురాలు జయలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.